



నేడు పాఠశాలలకు సెలవు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలకు సెప్టెంబరు 2న సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ లోతేటి శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు రావచ్చనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ యాజమాన్యం కింద నిర్వహిస్తున్న అన్ని పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు.



పులివెందులలో పాతుకుపోయారు

- పలు శాఖల్లో ఆ అధికారులదే హవా
- ప్రభుత్వం ఏదైనా.. కొలువు మాత్రం పులివెందులలో
- రూ.వేల కోట్ల పనుల్లో వచ్చే కమీషన్లే కారణమా?

పులివెందుల రూరల్, సెప్టెంబరు 1: సాధారణంగా ఏ ఉద్యోగి అయినా ఐదేళ్లకు మించి ఒకచోట పనిచేస్తే ప్రభుత్వం బదిలీ చేస్తుంటుంది. అయితే పులివెందులలోని పలు ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు ఇక్కడే ఏళ్లతరబి పాతుకుపోయారు. నిబంధనల ప్రకారం జరిగే బదిలీల్లో సైతం తమ పలుకుబడితో అదే సీటుకు అతుక్కుపోతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో లింగాల, తొండూరు, సింహాద్రిపురం, చక్రాయపేట, పులివెందుల, వేముల, వేంపల్లె మండలాలు ఉన్నాయి. ఒక వేళ బదిలీ అయినా ఈ నియోజకవర్గంలోని ఏదో ఒక మండలానికి వెళ్లి అక్కడ నుంచే చక్రం తిప్పుతున్నారు. కొన్ని శాఖల్లో బదిలీ అయినప్పటికీ ఇక్కడకు ఎవరినీ రానివ్వకుండా మేనేజ్ చేసుకొని డిప్యుటేషన్‌పై తిరిగి అదే సీటులో కూర్చొంటున్నారు. రాజకీయనేతలతో ఉన్న సంబంధాలతో ఆ శాఖను శాసించే స్థాయికి చేరిపోయారు. కచ్చితంగా వెళ్లాల్సి వస్తే తమ్మునికి బాగలేదనే, అమ్మకి బాగలేదనే, భార్యకు బాగలేదనో సర్టిఫికెట్లను చూపించి రాజకీయనాయకుల అండతో పులివెందులనే అంటిపెట్టుకుని ఉన్నారు. ఉద్యోగాలు చేయకుండా సొంత వ్యాపారం చేసుకుంటున్నారు.

పలు శాఖల్లో తిష్టవేశారు

2019 కంటే ముందు నుంచి పులివెందులలో తిష్టవేసిన అధికారులు అనేక శాఖల్లో ఉన్నారు. వీరంతా వైసీపీకి అనుకూ లురు అనే పేరుంది. అప్పటికే వైసీపీ గాలి వీయడంతో ఇక్కడి వైసీపీ నేతలను కాకాపట్టడం మొదలుపెట్టారు. 2019 ఎన్నికల అనంతరం వైసీపీ గెలిచి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రి తన సొంత ఊరికి నిధులు వరదలా పారించడం సాధారణమే. మరీ ముఖ్యంగా పాడాను ఏర్పాటుచేసి వేలకోట్ల రూపాయలు నిధులు పులివెందుల అభివృద్ధికి కేటాయించారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొందరు అధికారులు పులివెందులను వీడలేదు. ఎలా చేస్తే డబ్బులు మిగులుతాయో, కమీషన్లు ఎలా పొందాలో కూడా రాజకీయ నేతలకు వివరించి తిష్టవేశారు. రాజకీయ అండదండలతో వారు బదిలీ అయిన నెలకో రెండు నెలలకో డిప్యుటేషన్‌పై మళ్లీ ఇక్కడికే వచ్చేలా ప్రణాళికలు రచించారు. అందులో పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్, విద్యుత్ శాఖల్లోని కొందరు ఇంజనీరింగ్ అధికారులు తమ కుర్చీలకు మేకులు కొట్టుకొని ఉన్నారు.

ఇరిగేషన్, విద్యుత్ శాఖలదే మొదటి స్థానం

ఇరిగేషన్ శాఖలో తిష్టవేసిన ఇద్దరు ఇంజనీర్లపై భారీస్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. జీఎన్ఎస్ఎస్ కాల్వ నుంచి చక్రాయపేట మండలానికి నీటిని తరలించే పనుల్లోను, లింగాల కుడికాల్వ పరిధిలో జరిగిన మెటల్ రోడ్డు పనులు, పంప్‌హౌస్ నిర్మాణాలు, వాటిలో అమర్చిన సామాగ్రి, పైప్‌లైన్ పనులలో భారీగా అవకతవకలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. ఏళ్ల తరబడి పులివెందులలో తిష్టవేసి కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకున్నారు. ఇక విద్యుత్ శాఖలో తిష్టవేసిన ఓ అధికారి ఆ శాఖను శాసించే స్థాయికి ఎదిగారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ శాఖల్లోని కొందరు అధికారులు బినామీ వ్యక్తులను కాంట్రాక్టర్లుగా చూపించి వాళ్లే పనులు చేశారని సమాచారం.

నియామకాల్లోను..

ఇరిగేషన్, విద్యుత్ శాఖల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల్లోను తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. అర్హులైన వారికి కాకుండా అనుకూలమైన వారికి అనర్హులకు ఉద్యోగాలు వచ్చేలా చేశారు. అంతేకాకుండా పలు ప్రాంతాలలో ఎక్కువ మంది సిబ్బంది అవసరం ఉన్నా సరే కొత్తవారిని నియమించుకోకుండా ఉన్న వారితోనే పనిచేయిస్తూ డబుల్ బిల్లులు పొందారనే ఆరోపణలు ఆయా శాఖల నుంచే వినిపిస్తున్నాయి. ఇష్టానుసారం వ్యవహరించిన అధికారులు స్థానిక రాజకీయ నాయకులకు కమీషన్లు ఇస్తూ రెండు చేతులా సంపాదిస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకుని పులివెందుల్లోనే పాతుకుపోయారు.

వైద్యశాఖలో..

పులివెందుల పరిధిలోని వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులు కూడా పులివెందులను వీడడం లేదు. నల్లపురెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఏ, సూపర్‌వైజర్ పోస్టులు తమకు తప్ప వేరే వారికి కాదు అన్నట్లు తిష్టవేశారు. బదిలీ చేసిన మండలాల్లో ఖాళీ ఉన్నప్పటికి రాజకీయ పలుకుబడితో అక్కడికి వెళ్లడం లేదు. తమ ఇంట్లో వారికి బాగలేదని ఓ ఉద్యోగి ఇక్కడే ఉన్నారు. పోనీ ఆ ఉద్యోగి కుటుంబసభ్యులు ఇక్కడ ఉన్నారా అంటే అదీ లేదు. ఆయన సొంత ఊరిలో ఉన్నారు. మరో వ్యక్తి నల్లపురెడ్డిపల్లెలో తిష్టవేసినప్పటికి అక్కడ కూడా పనిచేయకుండా గతంలో వైసీపీ అండతో సొంత పని చేసుకుంటూ లక్షల ఆదాయం ఇప్పటికీ పొందుతున్నారు. ఈమె ద్వారా పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ ఉద్యోగి కూడా అప్పటి సీఎం, ఎంపీలతో దిగిన ఫొటోలు చూపించి అక్కడి డాక్టర్లను సైతం భయపెడుతున్నట్లు చెబుతున్నారు. అక్కడి అధికారులు, సిబ్బంది ఎవరికైనా కంప్లైంట్ చేస్తే విచారణ చేసే అధికారులను కూడా మేనేజ్ చేసే స్థాయికి వారు చేరుకున్నారని చెబుతారు. అలాగే మలేరియా విభాగంలో కూడా ఏళ్ల తరబడి ఓ అధికారి తిష్టవేశారు. ఇదిలా ఉండగా.. వైసీపీ ప్రభుత్వ హయాంలో చక్రం తప్పిన వీరంతా ప్రస్తుత ప్రభుత్వంలో కూడా అదే పెత్తనం సాగించడం విశేషం. గతంలో వీరిని ప్రశ్నించిన ప్రస్తుత అధికారపార్టీ నాయకులు.. ఇప్పుడు మౌనంగా ఉండటం వెనక డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి వారు తొండూరు, లింగాల, బిదినంచెర్ల, సంతకొవ్వూరు, కోరగుంటపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కూడా ఉన్నారు. ప్రశ్నించిన వారిని అటు వైసీపీ నేతలతోను లేదా టీడీపీ వారితోను అదీ కాకుంటే ఉద్యోగ సంఘాల నేతలతోను, విలేకరులతో కూడా ఫోన్లు చేయిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. పులివెందుల నియోజకవర్గంలో తిష్టవేసిన అధికారులపై సమగ్ర విచారణ చేస్తే ఆయా శాఖల్లో జరిగిన అవకతవకలు బట్టబయలు అవుతాయని అంటున్నారు. ఇప్పటికైనా ప్రజాధనాన్ని వేతనం రూపంలో పొందుతూ ప్రజలకు ఉపయోగపడకుండా రాజకీయాలు చేస్తున్న అధికారులపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నాం

- జగన్ ముందు వైసీపీ నాయకులు, కార్యకర్తల గగ్గోలు
- త్వరలోనే మంచి రోజులు వస్తాయి
- మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి



పులివెందుల, సెప్టెంబరు 1: మన ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు కాక ఇబ్బందులు పడుతున్నామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు విన్నవించారు. ఆదివారం పులివెందుల వైసీపీ కార్యాలయంలో వైఎస్ జగన్ ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు నాయకులు, కార్యకర్తలు తమ వ్యక్తిగత సమస్యలను ఆయనకు వివరించారు. అలాగే వైసీపీ ప్రభు త్వంలో కాంట్రాక్టు పనులు చేసిన వారందరు సమస్యలను విన్నవించుకున్నారు. అభివృద్ధి పనులు చేసినా బిల్లులు కాక.. బిల్లులు రాకపోవడంతో పనుల కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని.. ఇది ఇబ్బందిగా మారిందని జగన్‌కు చెప్పారు. అలాగే మరికొంతమంది టీడీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మాపైన ఒత్తిడి పెరుగుతోందని .. ఏకంగా కొందరు దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. మన ప్రభుత్వంలో భూము ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తెచ్చిన ప్రభుత్వ నిబంధనలతో టీడీపీ ప్రభుత్వం అందరిని ఇబ్బందిపాలు చేస్తోందని జగన్‌కు తెలిపారు. దీనికి జగన్ స్పందిస్తూ కొన్ని రోజులు ఓపికతో ఉండాలని వారికి సర్దిచెప్పారు. న్యాయస్థానం వెళ్లి బిల్లులు అందేలా చేస్తామన్నారు. త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూస్తామన్నారు. ఏ ఒక్కరు అధైర్యపడాల్సిన అవసరం లేదని ఆయన వారికి ధైర్యం కల్పించేలా మాట్లాడారు. అలాగే పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు జగన్‌ను కలిశారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్ రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజాద్‌బాష తదితరులు జగన్‌ను కలిశారు.

వైఎస్ఆర్‌కు నివాళులు అర్పించనున్న జగన్, షర్మిల

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులు అర్పించనున్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో నివాళులు అర్పించనున్నారు. కాగా, ఇప్పటికే జగన్ 31వ తేదీ రాత్రి పులివెందులకు చేరుకున్నారు. షర్మిల ఇడుపులపాయకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో జగన్, 8గంటల ప్రాంతంలో షర్మిల వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులు అర్పించనున్నారు.

జిల్లాలో తుఫాను ప్రభావం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు : కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 1: తుఫాను కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తుఫాను ప్రభావం జిల్లాలో కూడా ఉండే అవకాశాలు ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌తో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాలలో 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూములు ఏర్పాటు చేశామన్నారు భారీ వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని ఆయా రెవెన్యూ డివిజన్ల కంట్రోల్ రూములకు కేటాయించిన ఫోన్ నెంబర్లకు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

కడప కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 08562-246344, కడప ఆర్డీవో కార్యాలయం 08562-295990, జమ్మలమడుగు 9502836762, బద్వేలు 9989843246, పులివెందుల 9949044735 సెల్ నెంబర్లకు కాల్ చేసి వివరాలను తెలపాలన్నారు. నదులు, వంకలు, వాగులు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన ఇసుక బ్యాగ్‌లు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. రైతులు తమ పంటలు, ధాన్యం, పశు సంపదను సురక్షితంగా కాపాడుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఏదైనా అవాంచనీయ సంఘటనలు ఎదురైతే పైన తెలిపిన కంట్రోల్ రూమ్ నెంబర్లకు ఫోన్ చేయాలని కలెక్టర్ తెలిపారు.

చికెన్ వేస్టేజీలో.. చిలక్కొట్టుడు

- కార్పొరేషన్ ఆదాయానికి గండి
- అధికారులు, ఓ నేత జేబుల్లోకి నిధులు
- ఇదీ వ్యర్థాల టెండరులో గోల్‌మాల్


చికెన్ వేస్టేజీ

(కడప-ఆంధ్రజ్యోతి): పీనుగులపై కూడా పేలాలు ఏరుకునే బ్యాచ్ అంటే.. బహుశా ఇదేనేమో... వాళ్లకు ప్రభుత్వం నుంచి వచ్చే గౌరవ వేతనం, జీతాలు అవేవీ చాలవు. మా పాలన హయాంలో ఎంత నొక్కేద్దామని ప్రజాప్రతినిధులు ఉంటే, హోదా ఉన్నప్పుడే.. దొరికినంత దోచుకుందామని కొందరు అధికారులు తయారయ్యారు. వెరశి.. ఇప్పుడు అలాంటి వ్యవహారమే కడప కార్పొరేషన్‌లో బయటపడింది. కమిషనరుగా ప్రవీణ్‌చంద్ ఉన్నప్పుడు.. ఖజానాను నింపే ప్రయత్నం చేశారు. అవినీతి, అక్రమాలను అరికట్టి కార్పొ రేషన్‌కు ఆదాయం వచ్చేలా చేశారు. అయితే కొందరు మాత్రం కార్పొరేషన్ ఖజానా నింపితే మాకేం లాభం, మా జేబులు నిండితేనే మాకు డొక్కలు నిండేది అనుకున్నారు. అంతే! చికెన్ వ్యర్థాలకు టెండరు పెట్టి కార్పొరేషన్‌కు వెళ్లాల్సిన ఆదాయాన్ని సొంతజేబులకు మళ్లించుకోవడం చర్చనీయాంశమైంది.

కడపలో సుమారు 200కు పైగా చికెన్ దుకాణాలున్నాయి. వీటిలో కొన్ని హోల్‌సేల్ కాగా.. కొన్ని రిటైల్‌గా ఉన్నాయి. ఇక్కడ చికెన్, మాంసం విక్రయాలు జరు పుతుంటారు. అయితే చికెన్ కొట్ల వద్ద వ్యర్థాలు వస్తుంటాయి. అంటే కోడికాళ్లు, తలకాయ, బొచ్చు, పేగులు ఇతరత్రా వ్యర్థాలు పోగవుతుంటాయి. వీటికి మంచి డిమాండ్ ఉంది. ఇలాంటి వ్యర్థాలను చేపలు, క్యాట్‌ఫిష్‌లకు వినియోగిస్తుంటారు. పొరుగున నెల్లూరు జిల్లాలో చేపలు పెంపకం ఎక్కువ. అక్కడ చికెన్ వ్యర్థాలకు మంచి ధర ఉంది. మన జిల్లా లో కూడా అక్కడక్కడా చేపల పెంపకం ఉంది. దీంతో చికెన్ వ్యర్థాల కోసం అధికారులు టెండరు నిర్వహించగా రూ.20లక్షలకు ఒక కాంట్రాక్టరు దక్కించుకున్నారు. ఆయన కేవలం టెండరు అమౌంటులో రూ.5లక్షలు మాత్రమే చెల్లించారు. అయితే దాన్ని సబ్ కాంట్రా క్టరుకు ఇచ్చారు. టెండరు నిర్వాహకుడు సబ్ కాంట్రాక్టరు నుంచి నిధులు తీసుకున్నట్లు చెబుతారు. వచ్చిన వ్యర్థాలనంతా సేకరించి నెల్లూరు జిల్లాకు తరలిస్తారని చెబుతారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

టెండరు సొమ్మును కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉంది. అయితే నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం పలు ఆరోపణలకు తావిచ్చింది. చికెన్ వ్యర్థాల టెండరింగ్‌లో అవినీతి దాగి ఉందంటూ బీజేపీ నాయకుడు సుబ్బారెడ్డి ఇప్పటికే పత్రికా సమావేశాల్లో ఆరోపణలు చేశారు. అయితే కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై టెండరు అమౌంటును కార్పొరేషన్‌కు చెల్లించకుండా నెలనెలా ఆమ్యామ్యాలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చు కున్నట్లు ప్రచారం ఉంది. ఇందులో అధికార యంత్రాంగానికి సగం అయితే.. మరో సగం వాటా ఓ నేతకు అంటారు. అందుకే టెండరు కట్టబెట్టి గడువు ముగుస్తున్నప్పటికీ కూడా డబ్బులు కట్టకున్నా అధికారులు పట్టించుకోవడంలేదని చెబుతున్నారు. కార్పొరేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పన జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంటే కాకుండా.. కార్పొరేషన్ సొంతంగా నిధులు సమకూర్చుకోవాల్సి ఉంది. ఎక్కడ సొమ్ము కార్పొరేషన్‌కు రాకుండా జేబుల్లోకి వెళుతుంటే .. అక్కడ అవినీతి లీక్‌లకు ప్యాచ్ వేస్తేనే సొంత నిధులు జమ అవుతాయి. అలా వస్తేనే కార్పొరేషన్ సొంతంగా ఎదుగుతుంది. జనరల్ ఫండ్ సమృద్ధిగా ఉంటే యుద్ధప్రాతిపదికన అవసరమైన మౌలిక వసతులు కల్పించవచ్చు. అలా కాకుండా జగన్ హయాంలో ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించి కార్పొరేషన్, మున్సిపాలిటీలను దివాళా తీయిం చారు. అయితే పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా ఖజానా నింపుకున్న కార్పొరేషన్‌లు కాస్త పటిష్ఠంగా కనిపిస్తున్నాయి. అయితే కార్పొరేషన్‌లో మాత్రం ఖజానా నింపడం కన్నా సొంత జేబులు నింపుకునేందుకే ప్రయత్నాలు చేస్తుండడం పలు విమర్శలు వస్తున్నాయి.

భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని అంగీకరించం

- ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్టీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1: రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయ అభిమతానికి విరు ద్ధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న కొత్త భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని అంగీకరించమని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాధరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్ ఎదుట సీపీఎస్ రద్దు చేయాలని జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాష ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రఘునాధరెడ్డి మాటా డుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు సెప్టెంబరు 1 చీకటి రోజని.. ఎందుకంటే కేంద్రం సామాజిక ఆర్థిక భద్రత లేని భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని ఉద్యోగుల మెడకు చుడుతోందన్నారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్రం యూపీఎస్ అనే కొత్త భాగస్వామ్య పెన్షన్ విధానాన్ని అమలు చేయబోతున్నట్లు ప్రకటించిందన్నారు. ఈవిధానం గత ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పెన్షన్ల కంటే మెరుగైనది కాదని.. ఇవన్నీ ఒకటే నని.. ఓపీఎస్ మాత్రమే ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆమోదయోగ్యమైనది అని తెలిపారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు సురేశ్‌బాబు, సుబ్ర మణ్యరాజు, బాలగంగిరెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్, సుధాకర్‌రెడ్డి, దాదాపీర్, సీపీఎస్ రాష్ట్ర కన్వీనరు సుబ్రమణ్యం, రవిశంకరరెడ్డి, బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

యూపీఎస్ ఒప్పుకునే ప్రసక్తే లేదు

పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలన్నది ఏకైక లక్ష్యమని... యూపీఎస్ ఒప్పుకునే ప్రసక్తే లేదని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు స్పష్టం చేశారు. ఆదివారం కడప కలెక్టరేట్ ఎదుట ఎస్టీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగ ఉపాధ్యాయులు పోరాటం చేస్తున్నా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్, యూపీఎస్ అని పేర్లు మారుస్తూ పెన్షన్ విధానాలు రూపొందిస్తున్నాయన్నారు. ఉద్యోగుల జీతాల నుంచి కోత విధించకుండా ఉండే పాత పింఛన్ విధానం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రామచంద్ర, నాయకులు క్రిష్టఫర్ జాన్, శ్రీనివాసులు, రాజగోపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అనేక దఫాలుగా ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి అబ్దుల్లా మండిపడ్డారు. కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ గత రాష్ట్ర ప్రభుత్వం జీపీఎస్ తీసుకువచ్చి ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేసిందన్నారు. తక్షణం సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, వేణుగోపాలరెడ్డి, శ్రీనివాసులు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కడప తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్-257 ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్ విధానం మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌన్సిలర్ శ్రీనివాసులు, రామచంద్రరెడ్డి, రాజారావు, మణికుమార్, మస్తాన్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.





కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీటీఎఫ్, ఎస్టీయూ ప్రతినిధులు

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం : మంత్రి మండిపల్లి



రాయచోటి టౌన్, సెప్టెంబరు 1: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో 2వ సౌత్‌జోన్ టార్గెట్ బాల్ చాంపియన్‌షిప్ 2024-25 పురుషులు, మహిళల విభాగంలో జరిగిన పోటీల ముగింపు కార్యక్రమంలో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతి ఓటమి మరో గెలుపునకు నాంది పలుకుతుందని, పోటీల్లో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే ఆటల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. విద్య అనేది మనిషికి జ్ఞానాన్ని ఇచ్చి ఎలా మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగస్వామ్యం అయినప్పుడు పరిపూర్ణత గల మనిషిగా అభివృద్ధి చెందుతారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం క్రీడలతో పాటు విద్య, ఉద్యోగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాయచోటి పట్టణంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న టార్గెట్ బాల్ క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరై స్నేహపూరిత వాతావరణంలో ఈ క్రీడలు విజయవంతంగా జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వ్యాయామ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరు రాష్ట్రాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

కుడా వైస్‌చైర్మన్ వైవోనందన్ బదిలీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1: కడప పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) వైస్ చైర్మన్ వైవోనందన్‌ను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు కమిషనర్లు, ఆర్డీయంలను శుక్రవారం రాత్రి బదిలీ చేశారు. ఇందులో భాగంగా కుడా వైస్‌చైర్మన్‌గా ఉన్న నందన్‌ను బదిలీ చేసి టీడీఎంఏలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈయన ప్రస్తుతం కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో ఈయనను కమిషనర్‌గా రెగ్యులర్‌గా కొనసాగిస్తారా, వేరొకరిని నియమిస్తారా అన్నది వేచి చూడాలి.

మైలవరం నుంచి పెన్నాకు నీరు విడుదల



మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 1: మైలవరం జలాశయం గేట్లు ఎత్తి 400 క్యూసె క్కుల నీటిని పెన్నానదికి వదిలినట్లు మైలవరం జలాశయ డీఈఈ నరసింహమూర్తి, ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. గండి కోట జలాశయం నుంచి మైలవరానికి 20 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం నీటిని వదిలినట్లు తెలిపారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజల తాగు, సాగు నీటి అవసరాల కోసం పెన్నానదికి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తారు. గండికోట నుంచి మైల వరానికి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నాకు వదులుతారని పెన్నాపరివాహక ప్రాంతీయులు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 5.200 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మైలవరానికి నీరు తగ్గింపు

కొండాపురం, సెప్టెంబరు 1: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి ఆదివారం నీటి విడుదల తగ్గించినట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. శనివారం నుంచి 20,000 క్యూసెక్కులు ఉన్న నీటి ప్రవాహాన్ని 2,500కు తగ్గించారు. ఇప్పటికే మైలవరంలో 5 టీఎంసీలకు పైగా నీరు ఉండడంతో సీఈ ఆదేశాల మేరకు నీటిని తగ్గించినట్లు డీఈ తెలిపారు. సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 880 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 500 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గండికోటలోకి జీఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ ద్వారా 9500 క్యూసెక్కులు, వర్షపు నీటి ద్వారా 850 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉన్నట్లు డీఈ తెలిపారు. ప్రస్తుతం గండికోటలో 17.8 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు.

నెత్తురోడిన రహదారి

ఆగిన లారీని ఢీకొన్న స్కూటర్ ● ఇద్దరి మృతి



సంఘటన స్థలంలో వెంకటరమణ, దినేష్‌రెడ్డి మృతదేహాలు

ఖాజీపేట, సెప్టెంబరు 1: కడప-కర్నూలు జాతీయ రహదారిపై పాటిమీదపల్లె టోల్‌ప్లాజావద్ద నిలిచిన లారీని ఢీకొన్న ఘటనలో వెంకటరమణ (24), దినేష్‌రెడ్డి (19)మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు చింతకొమ్మదిన్నె మండలం పాపాసాహెబ్‌పేట వాసులు వెంకటరమణ, దినేష్‌రెడ్డి ప్రొద్దుటూరుకువెళ్లి స్కూటర్ కొనుగోలు చేసి అర్ధరాత్రి తిరిగి వస్తుండగా టోల్‌ప్లాజా వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. దీంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతిచెందగా దినేష్‌రెడ్డిని చికిత్స నిమిత్తం టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీఐ మోహన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అర్ధరాత్రి కావడంతో వారిని గుర్తించడం పోలీసులకు కష్టతరమైంది. ఎట్టకేలకు వారిని గుర్తించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ - యువకుడు మృతి



షేక్ రఫీ, పక్కనే ఉన్న కుక్క

వేముల, సెప్టెంబరు 1: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై భూమయ్యగారిపల్లె క్రాస్ వద్ద శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో షేక్ రఫీ (33) మృతిచెందాడు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాలిలాఉన్నాయి. శనివారం రాత్రి వేల్పుల గ్రామం బయట ఉన్న తోటకు కుక్కతో కలిసి వెళ్లి భూమయ్యగారిపల్లె క్రాస్ వరకు నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో షేక్ రఫీ మృతి చెందాడన్నారు. షేక్ రఫీ అన్న ఆబావల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చెన్నూరు, సెప్టెంబరు 1: రాజంపేట బైపాస్‌రోడ్డుపై బచ్చుంపల్లె వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన ఎం.గంగరాజు (63) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంగరాజు, ఆయన కుమారుడు నిత్య పూజయ్య బేల్దారి పనిచేసుకుంటుండేవారు. రోజుమాదిరిగానే కడపలో బేల్దారి పనులు ముగించుకుని రాత్రి ఇర్కాన్ సర్కిల్ వద్ద దిగి స్వగ్రామం బచ్చుంపల్లెకు నడుచుకుంటూ వెళుతుండగా వెనుక నుంచి రాజంపేట వైపు వెళుతున్న ఏపీ 39 వీబీ 1375 నెంబరు లారీ ఢీకొంది. ఈ సంఘటనలో గంగరాజు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని 108లో రిమ్స్‌కు తరలించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులకు సవాల్‌గా మారిన దొంగతనాలు

బంగారు అంగట్లో చోరీ ● నెల రోజుల్లో మూడు చోట్ల...



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపడుతున్న దృశ్యం

సుండుపల్లె, సెప్టెంబరు1: మండల కేంద్రంలో జరుగుతున్న వరుస దొంగతనాలు పోలీసులకు సవాల్‌గా మారింది. నెల రోజుల్లో మండల కేంద్రంలో మూడు చోట్ల దొంగతనాలు జరగడం ప్రజలను భయపెడుతోంది. శనివారం అర్ధరాత్రి తర్వాత మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆర్ఎస్ జ్యువెలర్స్‌లో దొంగతనం జరిగినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో తనిఖీ చేపట్టారు. షాపు యజమాని జగదీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 17 కిలోల వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు, వాటి విలువ రూ.11,90,000లు ఉంటుందన్నారు. షాపు లాకర్లో బంగారం ఉండడంతో లాకర్‌ను దొంగలు పగులగొట్టే ప్రయత్నాలు చేశారు.

సచివాలయం ఉద్యోగి బాధ్యతకు సలాం

- బెంగళూరు హాస్పిటల్‌లో పింఛన్ పంపిణీ



హాస్పిటల్‌లో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె, సెప్టెంబరు1: బెంగుళూరులోని ఆస్టర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న యర్రపురెడ్డి బసిరెడ్డికి ఆదివారం మోటకట్ల సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ గౌతమి పింఛన్ అందజేశారు. సంబేపల్లె మండలం మోటకట్ల గ్రామం చెంచురెడ్డిగారిపల్లె పింఛనుదారుడు బసిరెడ్డి కాలికి గాయం కావడంతో బెంగుళూరులోని ఆస్టల్ హాస్పిట ల్‌లో వారం రోజుల కిందట ఆపరేషన్ చేయించుకున్నారు. సెప్టెంబరు పింఛన్ పంపిణీ సమయంలో ఇంటి వద్ద లేకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్ ఆదివారం బెంగుళూరుకి వెళ్లి హాస్పిటల్‌లో పింఛన్ అందజేశారు.

ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్‌లో కోడూరు యువకుల ప్రతిభ



ప్రథమ బహుమతులతో విశ్వతేజ, భార్గవ్‌రామ్

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 1: ఇంట ర్నేషనల్ బ్యాడ్మింటన్ గ్రాండ్‌ప్రిక్స్ 2024 అండర్-19 విభాగంలో రైల్వేకోడూరు యువకులు గొబ్బూరు విశ్వతేజ, అరిగెల భార్గవ్ రామ్ జోడి మొదటి బహుమతి సాధించారు. పూణేలో ఆగస్టు 27 నుంచి జూనియర్ ఇంట ర్నేషనల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ఆక్రమణలో అప్పన్నకుంట



కంప చెట్ల నడుమ అప్పన్నకుంట

కట్టతవ్వి యథేచ్ఛగా నిర్మాణాలు ● నాడు కుంట నేడు గట్టు ఆక్రమణ

మౌన ముద్రలో అధికారులు ● చోద్యం చూస్తున్నవైనం

సుండుపల్లె, సెప్టెంబరు1: మానవ మనుగడపై గాలి, కుంటలు, చెరువుల ప్రాముఖ్యత ఎంతో ఉంది. కుంటలు, చెరువులు ఉండడం వలన భూగర్భంలో జలవనరులు పెరిగి తాగు, సాగునీరు కొరత ఉండదు. కుంటలు, చెరువుల ప్రాముఖ్యత తెలుసుకుని తెలంగాణలో అక్కడ ప్రభుత్వం చెరువుల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను కూలుస్తున్నారు. కట్టుకున్నది ఎవరనే ప్రశ్నలేకుండా చెరువుల ఆక్రమణలపై కొరడా ఝులిపిస్తున్నారు. రాష్ట్రంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు లేవు. వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సుమారు 25 ఎకరాల్లో ఉన్న అప్పన్న కుంట రోజు రోజుకూ అస్తిత్వాన్ని కోల్పోతోంది. ప్రస్తుతం చాప కింద నీరులా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. నాడు వైసీపీ పాలనలో అడ్డూ అదుపు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం చాపకింద నీరులా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళితే...

అప్పన్నకుంట సుమారు 20 ఏళ్ల కిందట మండల కేంద్రం నడి ఒడ్డున సుమారు 25 ఎకరాల్లో సర్వే నెంబరు 2169లో అప్పన్నకుంట ఉంది. ఈకుంట నుంచే మండల ప్రజలకు తాగు, సాగు నీటిని అందించేవారు. వందలాది ఎకరాల సాగుభూమికి సాగునీటిని అందించిన ఘనత ఈ కుంటకుంది. ఆక్రమణల కారణంగా అప్పన్నకుంట రాను రాను కుంచించుకుపోతోంది. చుట్టూ ఆక్రమణల కారణం గా కుంట విస్తీర్ణం రాను రాను తగ్గిపోతోంది. 2008లో వచ్చిన వరదల కారణంగా అప్పన్నకుంట తెగిపోయి మండలంలో సగం ఇండ్లు వరదనీటి ప్రవాహంలో మునిగిపోయాయి. అప్పట్లో పెద్ద మొ త్తంలో ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రస్తుతం అలాంటి వర్షాలు కురవడం లేదు. కాబట్టి ఇటువంటి విప త్తులు కనిపించడం లేదు. అప్పన్నకుంట చుట్టూ కుంట కట్టను తవ్వి అక్రమ నిర్మాణాలు చేపట్టడం తో కుంట విస్తీర్ణం తగ్గిపోతోంది. భారీ వర్షాలు కురి స్తే మండల కేంద్రానికి పెద్ద ప్రమాదమే పొంచి ఉందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లగా కుంట చుట్టూ అంతులేని అక్రమాలు జరిగాయి. ఇదంతా అధికారులకు, పాల కులకు కనిపించడం లేదా అని విమర్శ లు వస్తున్నాయి. మండల కేంద్రంలో ఇంటి స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఈ అక్రమాలు జరుగుతున్నాయి. ఇదంతా అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కొందరు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. రాయచోటి ప్రధాన రహదారి పక్కన చర్చి వెనుక భాగంలో అప్పన్నకుంట కట్టను తవ్వి కుంటలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోనే కాకుండా కుంట దక్షిణ భాగంలో, తూర్పు భాగం సహా కుంటకు రెండు వైపులా ఉన్న మొరవను సైతం ఆక్రమించి నిర్మాణాలు చేసేశారు. తెలంగాణ మాదిరి కుంటలు, చెరువుల రక్షణకు అధికారులు చర్యలు చేపడతారా లేదా వేచి చూడాలి. అక్రమ నిర్మాణాలు నిలపాలని, కుంటను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కుంటను ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణం - ఆక్రమణల కోసం చదును చేసిన కుంట స్థలం

తేడా కనిపించడం లేదు

వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. గుట్టలు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అనే తేడా లేకుండా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు, కొందరు అమ్ముకున్నారు. ప్రభుత్వం మారిందే కానీ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై చర్యలు మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం మారినా అక్రమాలు చేస్తున్న వారు ఇంకా చేస్తూనే ఉన్నారు. అప్పట్లో లక్షలాది రూపాయలు ప్రభుత్వ స్థలాలు అమ్మి సొమ్ము చేసుకున్న వారు ప్రస్తుతం తమకు ఏమీ తెలియనట్లు ఉంటున్నారు. అధికారులు సైతం అప్పుడు జరిగిన వాటిపై కదా మాకేమీ సంబంధం అన్న తీరుతో వ్యవహరిస్తున్నారని కూటమి నేతలు విమర్శిస్తున్నారు. ఆ ప్రభుత్వంలో కుంటలను ఆక్రమించి నిర్మాణాలు ఈ ప్రభుత్వంలో కుంట కట్టలను ఆక్రమించి నిర్మాణాలు చేస్తున్నారు. రెండు ఒక్కటే కదా తేడా ఏమీ కనిపించడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంట ఆక్రమణలకు గురవుతున్నా ఎందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు అనేది తెలియాల్సి ఉంది.

అక్రమ నిర్మాణాన్ని వెంటనే ఆపుతాము

కుంట, చెరువులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాము. అప్పన్నకుంటలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు ఆదివారం తెలిసింది. వెంటనే రెవెన్యూ సిబ్బందితో కుంటలు అక్రమ నిర్మాణాలను నిలిపివేస్తాము. అప్పన్నకుంటలో ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

హిందూ హక్కుల రక్షణకు అలుపెరుగని పోరు

ఆత్మీయ హిందూ సమ్మేళనంలో వీహెచ్‌పీ అఖిలభారత మార్గదర్శక మండలి సభ్యులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విరజానందస్వామి

కడప (కల్చరల్) సెప్టెంబరు 1: విశ్వహిందూ సమాజం హక్కుల, రక్షణ కోసం అలుపెరుగని పోరు సాగించేందుకు వెనుకాడే ప్రసక్తే లేదని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అఖిల భారత మార్గదర్శక మండలి సభ్యుడు విరజానందస్వామి స్పష్టం చేశారు. విశ్వవ్యాప్తంగా వున్న వేలాది ధార్మిక సంస్థల ఏకైక విశ్వ వేదిక విశ్వహిందూ పరిషత్ అన్నారు. 1964లో శ్రీ కృష్ణ జయంతి రోజున ఏర్పాటైన వీహెచ్‌పీ అంచెలంచెలుగా సుమారు వంద దేశాలకు విస్తరించి, యావత్ భారతంలోని సమస్త ధర్మాచార్యులు, సాధుసంతుల ఆశీస్సుల బలంతో నిరంతరం వికసిస్తూ ముందుకు సాగుతోందన్నారు. వీహెచ్‌పీ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా నగర వీహెచ్‌పీ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చిన్మయమిషన్ లలితా పంచాయతన దేవాలయంలో వీహెచ్‌పీ దక్షిణాంధ్ర ప్రాంత ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ బెస్తవేముల రామ్‌మహేష్ అధ్యక్షతన కడప నగర ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూ సమాజం అన్ని వైపుల నుంచీ దాడులకు గురౌతున్న సమయంలో 'యథా యథాహి ధర్మస్య' అన్న రీతిలో కృష్ణాష్టమి రోజున భారతగడ్డ మీద ఆవిర్భవించిన సంస్థగా ఖ్యాతిగాంచిందన్నారు. ప్రధానంగా అయోధ్య ఉద్యమం చరిత్రను మలుపు తిప్పిందన్నారు. ప్రతి హిందువు తనను తాను హిందువు అని చెప్పుకునే స్థితికి తీసుకువచ్చిందన్నారు. ముఖ్యంగా తమ వీహెచ్‌పీ కీర్తిపతాకం దేశ విదేశాల్లో ఎగరటానికి ప్రధాన కారణం ఆందోళనాత్మక కార్యక్రమాలే అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి గుమ్మళ్ల సత్యం, దక్షిణాంధ్ర ప్రాంత మార్గదర్శక మండలి సభ్యులు తురీయానంద సరస్వతిస్వామి, పూర్వప్రాంత అధ్యక్షుడు బైరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రాంత కార్యదర్శి కాకర్ల రాముడు, జిల్లా ఉపాధ్యక్షురాలు హేమమాలిని, కార్యదర్శి మనోహర్, పలువురు హిందూ బంధువులు, ధార్మిక సంస్థల కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా హాజరైన వారికి శ్రీరామ అక్షింతలు పంపిణీ చేశారు.

బహిరంగ మద్యపానంపై దాడులు

- నెల రోజుల్లో 2096 మందిపై కేసులు
- గంజాయి, గ్యాంబ్లింగ్, మట్కా, అక్రమ ఇసుక రవాణా, అక్రమ మద్యంపై ఉక్కుపాదం
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడి

కడప (క్రైం), సెప్టెంబరు 1: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఆగస్టులో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వాహకులపై దాడులు, ఇసుక అక్రమరవాణా, అక్రమ మద్యంపై దాడులు చేపట్టి ఉక్కుపాదం మోపారు. జిల్లా పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను ఆదివారం ఎస్పీ ప్రకటన విడుదల చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై పోలీసు సిబ్బంది ముమ్మర దాడులు నిర్వహించి 2096 మందిపై కేసులు నమోదు చేశారు. గంజాయి విక్రేతలపై దాడులు నిర్వహించి 25.01 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని, 12 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేశారు. గ్యాంబ్లింగ్ కేసుల్లో 61 కేసులు నమోదు చేసి, 354 మంది జూదరులను అరెస్టు చేసి రూ.9,03,890 నగదు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల్లో 12 మందిని అరెస్టు చేసి రూ.24,300 నగదు స్వాధీనం, కేసు నమోదు చేశారు. మట్కా నిర్వాహకులపై 23 కేసుల్లో 50 మంది అరెస్టు, రూ.4.94 లక్షలు నగదు స్వాధీనం, ఇసుక అక్రమ రవాణాలో 64 మంది అరెస్టు, 48 కేసులు, 181 టన్నుల ఇసుకను సీజ్ చేసి 52 వాహనాలను సీజ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాల్లో 4429.37 లీటర్లను స్వాధీనం చేసుకుని 30 కేసుల నమోదు, 39 మందిని అరెస్టు చేశారు.

మహిళలను అడ్డుకున్న రోప్ పార్టీ

- బయటి జిల్లాల అభిమానులకు చుక్కెదురు



జగన్‌జూజీ కలిసేందుకు వెళుతున్న వారిని అడ్డుకుంటున్న రోప్ పార్టీ

పులివెందుల టౌన్, సెప్టెంబరు 1: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై అభిమానంతో సుదూర ప్రాంతాల నుంచి కలవడానికి వచ్చిన మహిళలపై రోప్ పార్టీ పోలీసులు దాష్టీకం చూపించారు. సుదూర ప్రాంతాల నుంచి జగన్‌ను కలిసేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన అభిమానులపై ఇలా పోలీసులు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మాజీ సీఎం వైఎస్‌జగన్ వైఎస్‌ఆర్ కడప జిల్లా మూడురోజుల పర్యటనలో భాగంగా రెండోరోజు పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలవడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. అయితే వారిపై రోప్ పార్టీ పోలీసు సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు. జగనన్నను కలిసేందుకు వచ్చిన తమపై చొక్కాలు పట్టి లాగడం, మహిళలు అని చూడకుండా చేతులు వేసి నెట్టడం దారుణమని వాపోతున్నారు. జగన్ మోహన్‌రెడ్డిని కలిసేందుకు చిత్తూరు జిల్లా బంగారుపాలెం నుంచి పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. తమ అభిమాన నాయకుడిని చూసేందుకు వచ్చిన మాపై ఇలా ప్రవర్తించడం ఎంత వరకు కరెక్ట్ అంటూ వారు పోలీసులతో వాగ్వావాదానికి దిగారు.

160 గోవా మద్యం బాటిళ్లు పట్టివేత

ముద్దనూరు, సెప్టెంబరు 1: స్థానిక చిన్నదుద్యాల క్రాస్ వద్ద శనివారం నలుగురిని అదుపులోకి తీసుకుని 160 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ గడ్డం నాయుడు తెలిపారు. రాబడిన సమాచారం మేరకు సింహాద్రిపురం, కొండాపురం మండలాల వాసులు నలుగురు మద్యం బాటిళ్లను తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని గోవాకు చెందిన 160 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నిందితులపై కేసు నమోదు

ఒంటిమిట్ట, సెప్టెంబరు 1: శివాజీ రెస్టారెంట్‌పై, పనిచేస్తున్న సిబ్బంది, యజమానిపై విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటనలో కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేశారని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడిచేసిన సాలాబాదు గ్రామస్తులు కొండారెడ్డి, ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. మండలంలో విద్వేషాలను రెచ్చగొడుతూ దాడులు చేయడం ఆనవాయితీగా పెట్టుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకుని రౌడీయిజం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం - కేసు నమోదు

చిన్నమండెం, సెప్టెంబరు1: అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామస్తుల ఫిర్యాదుపై ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని ఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వండాడి పంచాయతీ మల్లూరు చాకిబండ రహదారి పక్కన రాత్రింబవళ్లు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుని శనివారం రాత్రి చిన్నమండెం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లిన ఎస్ఐ సుధాకర్ ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గొలుసు చోరీ

చెన్నూరు, సెప్టెంబరు 1: రామనపల్లెకు చెందిన మజ్జారి అరుణకుమారి మెడలో గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కుని వెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. గత నెల 29న ఉదయం 11గంటలకు ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఒక్క మారుగా మెడలోని గొలుసు లాక్కుని వెళ్లాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

కడప (క్రైం), సెప్టెంబరు 1: స్థానిక శంకరాపురం స్కౌట్ హాల్ వద్ద ఉన్న ఓ మహిళ అదృశ్యమైనట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. హరినగరి సుభాషిణి కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేది. ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు తెలిపారు. అదృశ్యమైన సుభాషిణి కుమార్తె తేజస్విని ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జనసేన నేత తుంగా రమణయ్య

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1 : జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన సందర్భంగా కడప నగరంలో జనసేన నాయకుడు తుంగా రమణయ్య ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అలాగే ఇందిరానగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. తుంగా రమణయ్య మాట్లాడుతూ సినీరంగంలో దేశంలోనే ఎక్కువ అబిమానులు ఉన్న హీరో పవన్ అన్నారు. రాజకీయాల్లో కూడా రాష్ట్ర అభివృద్ధిలో కీలక భాగస్వామిగా ఉన్నారన్నారు. భవిష్యత్తులో జనసేన నాయకత్వంలో కడప నగరాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబు





పులివెందుల: కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు.. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో...

పులివెందుల టౌన్, సెప్టెంబరు 1 : నవ్యాంధ్ర దార్శిక నేత చంద్రబాబు అని పలువురు నేతలు కొనియాడారు. నారా చంద్రబాబు నాయుడు మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టి నేటికి 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని 30వ సంవత్సరాల్లోకి అడుగుపెట్టిన సందర్భంగా పట్టణంలోని టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆదివారం ఉదయం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని టీడీపీ కార్యకర్తలు గాంధీ సర్కిల్‌లో చంద్రబాబునాయుడి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు 1995 సెప్టెంబరు 1న తొలిసారి ఏపీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారన్నారు. నేటితో 29 ఏళ్లు పూర్తయి 30వ సంవత్సరంలోకి అడుగుపెట్టారన్నారు. 28 ఏళ్లకు ఎమ్మెల్యే, 30 ఏళ్లకు మంత్రి, 45 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి అయ్యారన్నారు. ప్రస్తుతం 74 ఏళ్ల వయసులో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారన్నారు. చంద్రబాబు ఆధ్వర్యంలో ఏపీ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మరో పది సంవత్సరాలు పాటు ఆయన సీఎంగా కొనసాగితేనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందన్నారు.

సీఎం చంద్రబాబు శ్వాస, ధ్యాస రాష్ట్రాభివృద్ధే

చెన్నూరు, సెప్టెంబరు 1: సీఎం చంద్రబాబు శ్వాస, ధ్యాస రాష్ట్రాభివృద్ధేనని టీడీపీ మండల నేతలు పేర్కొన్నారు. చంద్రబాబు లాంటి నేత రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ప్రజల అదృష్టమని, అలాంటి నేత నిత్యం ఆయురారోగ్యాలతో ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తుండాలని ఆకాంక్షించారు. తొలిసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసి 29 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా టీడీపీ చెన్నూరు కార్యాలయంలో మండల కన్వీనరు విజయభాస్కరరెడ్డి, పాలగిరి పెద్దసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతో రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అమరావతి, పోలవరంపై ప్రత్యేక దృష్టి సారించారని, రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం పూర్తి చేస్తే రాష్ట్రమంతా సస్యశ్యామలమవుతుందని భావించి కేంద్రాన్ని ఒప్పించి నిధులు సాధించారన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు, కడప జిల్లాలో కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.వేల కోట్లు కేటాయించి అక్కడ యువతకు ఉపాధి కల్పించబోతున్న ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, బీసీ సంఘం నేతలు జి.శ్రీనివాసులు, ఆటోబాబు, కుందేటి క్రిష్ణయ్య, తెలుగు యువత జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, ఐటీడీపీ మణికంఠ, జిల్లా రైతు విభాగం నేతలు సుధాకర్‌రెడ్డి, అల్లాడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది అవిశ్రాంత పోరాటం

సింహాద్రిపురం, సెప్టెంబరు 1: రాజకీయ రంగంలో అవిశ్రాంత పోరాటం, అలుపెరగని నైజం సీఎం చంద్రబాబుదేనని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) సతీమణి లతారెడ్డి పేర్కొన్నారు. 1995 సెప్టెంబరు 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసి నేటితో 29 ఏళ్లు పూర్తి చేసుకుని 30వ సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఆదివారం సింహాద్రిపురంలో మారెడ్డి లతారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నేతలు కేక్ కట్ చేసి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శ్రీధర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పీజీ రాజగోపాల్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 29 ఏళ్లు పూర్తయి 30వ ఏట ప్రవేశించడంలో భాగంగా కడప నగరం జడ్పీ ఆవరణంలో గల ప్రేమాలయ వృద్ధుల వసతిగృహంలో టీడీపీ కడప నగర అధ్యక్షుడు సానపరెడ్డి శివకొండారెడ్డి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి నిరాశ్రయుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత ముఖ్యమంత్రిగా చేసిన సేవలు ప్రజలందరూ గుర్తుంచుకున్నారన్నారు. వాణిజ్యవిభాగం నగర అధ్యక్షుడు సానపరెడ్డి రవిశంకర్‌రెడ్డి, సభ్యులు జియావుద్దీన్, శ్రీను, కొండా సుబ్బయ్య, పలువురు పాల్గొన్నారు.

హబీబుల్లా వీధిలో...

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 1 : కడప నగరం హబీబుల్లావీధిలో అల్లాబకాష్ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా టీడీపీ నాయకుడు రవిశంకర్‌రెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా, అమానుల్లా షేక్ మాట్లాడారు.

దేశం గర్వించదగ్గ నేత చంద్రబాబు

కడప రూరల్, సెప్టెంబర్ 1 : దేశం గర్వించదగ్గ నేత సీఎం చంద్రబాబునాయుడు అని టీడీపీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గంగిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని టీడీపీ లీగల్‌సెల్ కార్యాలయంలో ఆదివారం న్యాయవాదులతో కలిసి కేకును కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు.





సింహాద్రిపురంలో సంబరాలు జరుపుకుంటున్న లతారెడ్డి, టీడీపీ నాయకులు...కడప: నిరాశ్రయులకు అన్నదానం చేస్తున్న శివకొండారెడ్డి

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు: కమిషనర్



ఆర్టీసీ బస్టాండులో నీటిని తొలగింపజేస్తున్న కమిషనర్ నందన్ తదితరులు

కడప(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1: నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వైఓ నందన్ అధికారులకు ఆదేశించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆదివారం కడప నగరంలో లోతట్టుప్రాంతాలను పరిశీలించారు. డ్రోన్ ద్వారా నీటి నిల్వలు ఎక్కడక్కడ ఉన్నాయో పరిశీలించి వాటిని తొలగించే ఏర్పాట్లను చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే వెంటనే తొలగించాలని శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. అలాగే అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, ఫాగింగ్‌వంటివి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసరు చంద్రశేఖర్, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, తిథిభోజనం



విద్యాసామగ్రి అందిస్తున్న దాతలు

చక్రాయపేట, సెప్టెంబరు 1:మండలంలోని మారెళ్లమడక గ్రామం టీడీపీ నాయకుడు బొజ్జ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి 50 మంది విద్యార్థులకు ఆదివారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తిథిభోజనం అందజేశారు. కొంతకాలంగా తన భార్య ధనమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, తిథిభోజనం ఏర్పాటు చేస్తున్నారు. ఎంఈఓ రవికుమార్ అధ్యక్షతన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, అట్ట, పలక, పెన్సిల్లు, పెన్నులు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రఘునాథరెడ్డిని ఆదర్శకంగా తీసుకోవాలన్నారు. ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, టీడీపీ అధికారప్రతినిధి పట్టెం అశోక్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఎద్దుల చంద్ర, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచు మహేశ్వరరెడ్డి, రాజారెడ్డి, ఆపస్ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, హెచ్‌ఎం బోగీశ్వరయ్య పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ హరి కుటుంబానికి రూ.50 వేలు సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

సింహాద్రిపురం, సెప్టెంబరు 1: మండలంలోని కసనూరు గ్రామానికి చెందిన బోనాల హరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. పులివెందుల ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్, అవుట్‌డోర్ ఫొటో, వీడియోగ్రాఫర్ల తరపున మృతుని కుమార్తె ప్రణవి, కుమారుడు తనీష్, భార్య ఉమాదేవికి ఆదివారం రూ.50,500 నగదును అందజేశారు. యూనియన్ లీడర్లు, అల్లాబకాష్, గంగాప్రసాద్, సురేష్, శివరెడ్డి, భరత్‌కుమార్, శ్రీను, నబీరసూల్, మారుతి, గోపాల్, బాషా, నారాయణ, ఫొటో గ్రాఫర్ల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పీజీ సర్జరీ విద్యార్థుల సీఎంఈ ప్రోగ్రాం



క్విజ్ పోటీలో బహుమతి అందిస్తున్న దృశ్యం

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 1 : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు ఆదివారం పీజీ విద్యార్థుల సర్జరీ విభాగ సీఎంఈ జోనల్ స్థాయి ప్రోగ్రాంను ఫాతిమా మెడికల్ కాలేజీలో నిర్వహించారు. థైరాయిడ్, పారా థైరాయిడ్ వ్యాధులపై జరిగిన ఈ సదస్సుకు సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ ముక్తేశ్వరయ్య, తిరుపతి స్విమ్స్ డాక్టర్ శ్రీహరిరావు, తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీ వైద్యుడు శ్రీకాంత్‌రెడ్డి, చిత్తూరు అపోలో మెడికల్ కాలేజీ వైద్యుడు రామక్రిష్ణ, కుప్పం మెడికల్ కళాశాల డాక్టర్ చెన్నన్న, సర్జరీ విభాగపు పీజీ వైద్యులు హాజరయ్యారు. పీజీ విద్యార్థుల సర్జరీకి సంబంధించి నిర్వహించినన క్విజ్ పోటీలో తిరుపతి పీజీ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని, ఫాతిమా కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. సర్జరీ ప్రొఫెసర్లు డాక్టర్ గిరిధర్, క్రిష్ణకిశోర్, అసిస్టెంటు ప్రొఫెసరు ఖాదర్‌బాషా, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ లోకేశ్వర్‌రెడ్డి, ఆర్థోప్రొఫెసరు డాక్టర్ నగేశ్, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్లుగా వ్యవహరించి కార్యక్రమాన్ని నిర్వహించారు.

కృష్ణాజలాల వివాదంపై వెంటనే అఖిలపక్షం నిర్వహించాలి



సమావేశంలోమాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 1: కృష్ణాజలాల వివాదంపై వెంటనే అఖిలపక్షం నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆపార్టీ కడప నగర కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రీయ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణాజలాల వివాదంపై వెంటనే అఖిలపక్షం నిర్వహించాలని డిమాండ్ చేశారు. పెండింగులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి కరువు రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కడప నగర కార్యదర్శి రామ్మోహన్, నగర కమిటీ సభ్యులు జమీల, దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సీపీఎం పట్టణంలోని పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి : సీఐ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 1 : గణేశ్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి అని సీఐ రోషన్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్ కార్యాలయంలో ఆయన ఎస్ఐ ప్రతాప్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గతంలో మాదిరి కాకుండా ఈ సంవత్సరం ఎస్పీ ఆదేశాల మేరకు సింగిల్‌విండో పద్ధతిలో అనుమతు లు లభించాయని సింగిల్‌విండో విధానంతో అనుమతులు ఇస్తున్నామన్నారు. వాట్సాప్ గ్రూపు ద్వారా ప్రభుత్వం అనుమతులు సులభతరం చేసిందన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీలు 7995095800 నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపితే ఎన్‌ఓసీ కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం ఆ నెంబరుపై వాట్సాప్‌లో వస్తుందన్నారు. కమిటీలు 'జీఏఎన్‌ఈఎస్‌హెచ్‌యూటీఎస్‌ఏవీ.ఎన్‌ఈటి' అనే వెబ్‌సైట్‌లో గణేశ్ మంటపం ఏర్పాటుకు సంబంధిత వివరాలు నమోదు చేయాలన్నారు.

'ఉద్యోగులకు గుదిబండగా సీపీఎస్, యూపీఎస్'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1 : ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్, యూపీఎస్‌లు గుదిబండగా మారాయని బీసీపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రబాబు తెలిపారు. ఆదివారం బహుజన టీచర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల పాలిట సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్నారు. సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల హామీ ఇచ్చిన వెంటనే సీపీఎస్ తొలగిస్తూ ఓపీఎస్‌ను అమలు పరిచే విధానంలో కొన్ని రాష్ట్రాలు హామీలు నిలబెట్టుకోగా మన రా ష్ట్రంలో ఏర్పడిన ప్రభుత్వం మాత్రం ఇంకా దీని గురించి ఏ విధమైన ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. తక్షణం సీపీఎస్, యూపీఎస్ విధానాలు రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీసీపీ నాయకులు గూడూరు పెంచలయ్య, జయరాం, మధుసూదన్, ససూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం మాజీ నాయకుడికి ఘన నివాళి



రవీంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1:ఉమ్మడి కడప జిల్లా విద్యార్థి సంఘం నాయకుడుగా పనిచేసి విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన ఎం.రవీంద్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్ కోరారు. ఆదివారం ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో రవీంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలివ్వాలి: సీపీఐ



పతాకావిష్కరణలో రైతు సంఘం సభ్యులు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 1 : రైతులకు స్కేల్ ఆఫ్ ఫై నాన్స్ ప్రకారం రు ణాలివ్వాలని రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గాలి చంద్ర పేర్కొన్నారు. రైతుల కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆదివారం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి సరైన వర్షాలు లేక వేసిన పంటలు చేతికి రాక రైతులు అప్పులపాలయ్యారన్నారు. కావున రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసి రుణభారం నుంచి రైతులను గట్టెక్కించాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం తిరిగి నూతన రుణాలు ఇవ్వాలని, రైతులు పండించిన పంటలకు మద్దతు ధర, గ్యారంటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, పోతిరెడ్డి, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా శివ



వేముల, సెప్టెంబరు 1: వేముల మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షునిగా వేమ శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పులివెందులలో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల సమావేశంలో శివను వేముల మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. శివ మాట్లాడుతూ నాపై నమ్మకంతో మండల అధ్యక్షునిగా ఎన్నుకుందున్నందుకు జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్‌కు, ఇతర అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు.

ఘనంగా తులకాంతమ్మ జాతర

సీకేదిన్నె, సెప్టెంబరు 1: జగన్మాత ముత్తు తులకాంతమ్మ జాతర భక్తులు ఘనంగా నిర్వహించారు. అంగడివీధిలో వెలసిన తులకాంతమ్మ జాతర ఆదివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. జాతరను పురస్కరించుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

పుట్టపర్తి రచనలను వారసత్వంగా పరిరక్షించాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 1:మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణచార్యుల అముద్రిత రచనలను తెలుగుజాతి వారసత్వ సంపదగా భావించి రక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య తెలిపారు. ఆదివారం పుట్టపర్తి నారాయణచార్యుల వర్ధంతి సందర్భంగా రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంస్థ ప్రధాన కార్యదర్శులు జనార్ధనరాజు, వైవీయూ పాలక మండలి సభ్యులు మూలమల్లిఖార్జునరెడ్డి, బాలయల్లారెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో గంగాధర్, మధుబాబు, డేవిడ్, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సాహితీ కీర్తి పుట్టపర్తి

కడప (ఎర్రముక్కపల్లె), సెప్టెంబరు 1 :ప్రాచీన ఆధునిక ఆంధ్ర సాహిత్య కీర్తి సరస్వతి పుత్ర పద్మశ్రీ డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అని భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తెలిపారు.ఆదివారం మహాకవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్రీస్తుకు మొదటి గురువు మరియతల్లి

కడప (కల్చరల్) సెప్టెంబరు 1: క్రీస్తు ప్రభువుకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పిన మొట్టమొదటి గురువు మరియతల్లి అని కడప డాన్ బోస్కో సలేషియన్ గురువులు ఫాదర్ అశోక్, ఫాదర్ పాపయ్య పేర్కొన్నారు. ఆరోగ్యమాత ఉత్సవాలను పురస్కరించుకుని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నాల్గవ రోజు ఆదివారం దివ్య బలిపూజ, మరియతల్లి సందేశాన్ని విశ్వాసులకు అందించారు. దేశానికి రాజైనా తల్లికి కొడుకే అన్నట్లుగా క్రీస్తు ఆ భగవంతుడి అనుగ్రహం వలన మానవుడిగా జన్మించారన్నారు. 12 ఏళ్ళ ప్రాయంలోనే వేద పండితులతో అనేక విషయాలను బోధించి విశదీకరించారన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్వాసులు, చర్చిపెద్దలు, సుందరమ్మ, సుశీలమ్మ, శ్యామలమ్మ, స్వరూపరాణి, సౌజన్య, జయమ్మ, యూత్‌కమిటీ సభ్యులు విన్సెంట్, పాల్గొన్నారు.

నేత్రదానంతో ఇద్దరి జీవితాలకు వెలుగులు

కడప (మారుతీనగర్), సెప్టెంబరు1:నేత్రదానం చేయడం వల్ల అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరి జీవితాలకు వెలుగులు ప్రసరింపచేయగలరని పుష్పగిరి కంటి ఆసుపత్రి డీపీఎం డాక్టర్ సునీత పేర్కొన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో పుష్పగిరి విట్రియా రెటినా ఇన్‌స్టిట్యూట్ (కడప) డీబీసీఎస్ సమన్వయంతో ఆదివారం స్థానిక మహావీర్‌సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీప అంబేడ్కర్ సర్కిల్ వరకు మౌన ర్యాలీ నిర్వహించారు.

బాలక్రిష్ణ ఒక లెజెండ్



సంబరాలు జరుపుకుంటున్న అభిమానులు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 1: బాలక్రిష్ణ 50ఏళ్ల సినీ చరిత్రలో ఎన్నో విజయవంతమైన సినిమాలు తీసి చరిత్ర సృష్టించిన ఒక లెజెండ్ అని బాలక్రిష్ణ అభిమానులు పేర్కొన్నారు. బాలక్రిష్ణ సినిమాల్లో అరంగేట్రం చేసి 50ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం ఎర్రగుంట్లలోని హేమా పిక్చర్ ప్యాలెస్‌లో అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలక్రిష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు రమేష్ , అభిమానులు సన్నపురెడ్డి సంజీవరెడ్డి, నగభూషణంరెడ్డి, కొండారెడ్డి, పెద్దసేటు, చిన్నసేటు, సురేష్ నందమూరి అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ..!

- రోడ్డును ఆక్రమించి మరుగుదొడ్లు నిర్మించిన ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం
- దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 1 : ఏ స్కూల్లోనైనా విద్యార్థులకు మరుగుదొడ్లు కాంపౌండు లోపల నిర్మిస్తారు. ఎందుకంటే నిత్యం వందలాది మంది విద్యార్థులు ఆ మరుగుదొడ్లు వినియోగిస్తే దుర్వాసన వెదజల్లుతోంది. కానీ గోపవరం పంచాయతీలో ఏకంగా ఓ స్కూలు యాజమాని, వైసీపీ నాయకుడు మాజీ సర్పంచ్, పబ్లిక్ రోడ్డును ఆక్రమించి తన స్కూలు విద్యార్థులకు టాయిలెట్లు నిర్మించారు. తలుపులు కూడా రోడ్డు వైపునకు పెట్టారు. దీంతో ప్రతిరోజు విద్యార్థులు వదిలే మల, మూత్ర విసర్జనలతో స్థానికులు తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి తలుపులు, కిటికీలు మూసుకుని వుండాల్సివస్తోందని రోగాల బారిన పడుతున్నామన్నారు. స్కూలు కరస్పాండెంట్ పంచాయతీ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు కావడంతో దౌర్జన్యంగా రోడ్డును ఆక్రమించి నిర్మించారని స్థానికులు అనేక మార్లు కలెక్టరు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు. అంతేకాకుండా పంచాయతీ అధికారులు మల్లేలమ్మ గుడిసందుకు కనీసం రోడ్డు వేయలేదన్నారు. విద్యుత్ పోల్స్ పాతి లైన్లు లాగలేదన్నారు. తాగునీటి పైపులైన్లు కూడా వేయలేదన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఈ ప్రాంతంలో పర్యటించి స్థానికులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా చర్యలుతీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డు మీద కట్టిన స్కూలు మరుగుదొడ్లు

రోడ్డును ఆక్రమించి మరుగుదొడ్లు కట్టారని ఫిర్యాదులు అందాయి

గోపవరం పంచాయతీ మల్లేలమ్మ గుడి వీధిలో రోడ్డును ఆక్రమించి ప్రైవేటు స్కూలు వాళ్ళు మరుగుదొడ్లు నిర్మించారనే ఫిర్యాదు వచ్చింది. పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, నేను వెళ్ళి పరిశీలించాం. త్వరలోనే రోడ్డు సర్వేచేయించి అక్రమంగా రోడ్డుపై నిర్మించిన మరుగుదొడ్లపై చర్యలు తీసుకుంటాం.స్కూలు యజమానికి నోటీసులు జారీ చేస్తాం. స్పందించకుంటే చర్యలు తీసుకుంటాం.

రామాంజనేయులురెడ్డి , పంచాయతీ విస్తరణ అధికారి,ప్రొద్దుటూరు

వయోజన విద్యాకేంద్రాల ఏర్పాటు

బద్వేలుటౌన్, సెప్టెంబరు 1 : లిటరసీ ఇండియాట్రస్ట్, చెన్నై ఆర్థిక సహాయంతో వయోజన విద్యాకేంద్రాలను ఏర్పాటుచేసి చదువు రానివారికి రాత్రిపూట బడులను ఏర్పాటుచేసి విద్యను అందించడం కోసం మమ్రే ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవాసంస్థవారు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి అర్బన్ ఎస్ఐ రవికుమార్, మమ్రే ఫౌండేషన్ అధినేత వయోజన విద్యాకేంద్రం పీఓ డాక్టర్ సుందరం హాజరయ్యారు. అనంతరం విద్యాబోధనకు అవసరమైన పరికరాలు, పుస్తకాలు, పలకలు, బ్లాక్‌బోర్డు తదితర వస్తువులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రంలో జింకా శాంతమ్మ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కన్నులపండువగా శివపార్వతుల కల్యాణం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1: అగస్త్యేశ్వరాలయంలో మాసశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు నిర్వహించారు. పూజలు అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

సాహితీశిఖరం పుట్టపర్తి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1: సాహితీరంగంలో శిఖర సమానుడు పుట్టపర్తి నారాయణాచార్యులు అని పుట్టపర్తి సాహితీపీఠం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి నారాయణాచార్యుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నారాయణాచార్యుల విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి. రవిశంకర్, ప్రభుకుమార్, అంకాల్‌కొండయ్య, సాయికుమార్, గంగాధర్, మధు, సుధాకర్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలు

రాజుపాలెం, సెప్టెంబరు 1 : మండలంలోని వివిధ పాఠశాలల్లో వారం రోజుల నుంచి పారిశుధ్య కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. ఆదివారం రాజుపాలెం మండలంలోని ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలులో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలి

కాశినాయన సెప్టెంబరు1: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు.ఆదివారం ఓబుళాపురం మూడు రోడ్ల కూడలిలో రోడ్డుభద్రతా నియమావళిపై వాహన చోదకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుప్రమాదాల్లో ఎక్కువశాతం మరణాలు హెల్మెట్ ధరించక పోవడంమూలంగానే తలకు బలమైన గాయాలు తగిలి చనిపోతున్నారన్నారు. ఈకార్యక్రమం లో పలువురు పోలీసులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

బద్వేలు రూరల్, సెప్టెంబరు 1 : విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా బద్వేలు, పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్లు, డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడతున్నారని తక్షణమే యుద్ధప్రాతి పదికన పారిశుధ్య పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరిఇమ్మానుయేల్, ఆనందరావు, శేఖర్, ఓబయ్య, రమేశ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఉద్యోగులకు ప్రత్యామ్నాయం చూపండి



ర్యాలీ చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు , సెప్టెంబరు 1 : ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలోని మద్యం దుకాణాల్లో ఉద్యోగులకు ప్రత్యామ్నాయం చూపాలని ప్రగతి శీల కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్టేట్‌బేవరేజ్ కార్పొరేషన్ సేల్స్ మెన్ సూపర్‌వైజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం నుంచి మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో వైసీపీ ప్రభుత్వం మద్యం షాపులలో సేల్స్ మెన్, సూపర్‌వైజర్లుగా దాదాపు 15000 మంది ని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చేర్చుకున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నదన్నారు. తద్వారా దుకాణాల్లో పనిచేసే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో మురళీప్రసాద్,పాల్ , నవీన్‌రాజ్, శ్రీనివాసులు,శివ ,సురేష్ భాస్కర్ రెడ్డి, బాల వెంకటయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదలపై ధరల భారాన్ని తగ్గించాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బద్వేలు,సెప్టెంబరు 1: పెట్రోలు,డీజల్ ధరలను తగ్గించి పేదలపై భారాన్ని నియంత్రించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు పేర్కొన్నారు. ధరలు తగ్గించాలని పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ నిరసనలో భాగంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయని బియ్యం, పప్పులు, చింతపండు వంటి నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14రకాల నిత్యావసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం పంపిణీతో సరిపెట్టేస్తోంద న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు రమణయ్య, రవీంద్ర, రమణ, ఏరియా కార్యవర్గ సభ్యురాలు విజయమ్మ, మహిళా సంఘం నాయకురాలు నలోనికుమారి, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, కార్యకర్తలు రవి, నరసయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుంకులాంబాదేవి అమ్మవారు

జమ్మలమడుగు, సెప్టెంబరు 1: జమ్మలమడుగు మండలంలోని చలివెందుల గ్రామంలో ఆదివారం సుంకులాంబదేవి అమ్మవారి ఆలయం 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూజలు చేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా సమీప గ్రామస్తులు చలివెందుల, దేవగుడి, దానవులపాడు తదితర గ్రామాలకు చెందిన భక్తులు ఆలయంలో పూజలు చేసి మొక్కుకున్నారు. ఆలయ కమిటీవారు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఉధృతంగా కుందూ

పెద్దముడియం, సెప్టెంబరు 1 : ఎగువ నుంచి వస్తున్న వరద, వర్షం నీటితో కుందూ ఉధృతంగా ప్రవహిస్తుంది. ఇటు జిల్లాలోనూ అటు ఎగువన రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో కుందూనది పోటెత్తుతోంది. శనివారం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో భారీగా వర్షం కురవడంతో, ఎగువ నుంచి వస్తున్న వరదతో పెద్దముడియం మండలంలో నెమళ్లదిన్నె వంతెనపై రెండు అడుగులు మేర కుందూ ప్రవహిస్తోంది. దీంతో కుందూ అవతలి గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. నెమళ్లదిన్నె వైపు నుంచి బలపనగూడూరు, కె.కొట్టాలపల్లె, జంగాలపల్లె, ఉప్పలూరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరో వైపు కుందూ ప్రవాహం ఎక్కువగా ఉండడంతో చిన్నముడియం, చిదిపిరాళ్లదిన్నె గ్రామాల మధ్య ఉన్న ఏటికి వరదనీరు ఎక్కువ రావడంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. పెద్దముడియం, తుడుములదిన్నె వంతెనల మధ్య వీఆర్వోలు, పోలీసు సిబ్బంది, వీఆర్ఏలు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మొత్తానికి ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రం 5గంటల సమయానికి రాజోలి వద్ద 18వేల క్యూసెక్కుల ప్రభావం ఇన్‌ఫ్లో ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 1 : మూడులక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంలో వున్నారని వారందరికీ పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాం సుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్నిపునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు శ్రీనివాసరెడ్డి, క్రిష్ణారెడ్డి, సుబ్బయ్య, సయ్యద్‌బాషా, నరసింహకుమార్, గోవర్ధన్‌రెడ్డి,ఈశ్వర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, అప్సర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేయాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 1 : సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని స్టేట్ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల ఏపీటీఎఫ్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపీఎస్ తప్ప వేరే ప్రత్యామ్నాయాన్ని ఒప్పుకోకూడదన్నారు. పెండింగు బిల్లులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1: నైతికతే నిజమైన స్వేచ్ఛ అని జమా అతే ఇస్లామి హింద్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు రెహానా, పట్టణాధ్యక్షురాలు హసీనా పేర్కొన్నారు. ఆదివారం ఖాదరాబాద్‌లోని దేశ వ్యాప్త జాగృతి ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు ఇతరులను ఇబ్బంది పెడుతూ జీవించడం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయిషా, మహబూబ్‌చాంద్, గులాబ్‌జాన్, ఆయేషాకౌసర్ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి ఆర్థిక సాయం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 1: కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకుంటున్న ఎర్రగుంట్ల రాణీవనానికి చెందిన షేక్ ఫాతిమాకు ఎర్రగుంట్ల మానవత యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించింది. యూనిట్ ఆధ్వర్యంలో రూ.5వేలు, యూనిట్ సభ్యులు గంగాధర్‌రెడ్డి రూ.2వేలు, రమేష్‌బాబు రూ.2వేలు, రమణారెడ్డి వేయి రూపాయలు మొత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జునరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు, కౌన్సిలర్ ఆలి, కో ఆప్షన్ సభ్యుడు రఫి తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనపై విచారణ చేయాలి

జమ్మలమడుగు, సెప్టెంబరు 1: గుడ్ల వల్లేరు ఘటనపై సమగ్ర విచారణ చేయాలని డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లయ్య, తులసీశ్వర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులోని ఎన్జీవో కార్యాలయంలో వారు మాట్లాడారు. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల హిడెన్ కెమెరాల ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేసి ఎంతటివారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

జీవోనెంబరు77ను రద్దు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1: కూటమి ప్రభుత్వం జీవోనెం.77ను రద్దు చేసి ప్రైవేటు కళాశాలలో చదివే విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను అందజేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున పేర్కొన్నారు. ఆదివారం ఏబీవీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేశ్ జీవోనెం.77ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇప్పటికీ ఆ జీవోను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ప్రొద్దుటూరు కన్వీనర్ చరణ్‌కుమార్, నగర కార్యదర్శి శివనారాయణ, సాయిఅభినయ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మిఠాయిలు పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 1: చంద్రబాబు ముఖ్యమంత్రిగా 30 సంవత్సరాలు అయిన సందర్భంగా నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో వృద్ధులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఆదివారం మదర్‌థెరిస్సా వృద్ధాశ్రమంలో మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి టప్పా మహబూబ్ బాష , టీడీపీ తెలుగు వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, సీబీఎన్ ఆర్మీ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్య, రామూనాయుడు, టీడీపీ జిల్లా కార్యదర్శి సిద్దయ్య, సమర, బాష, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు జ్యుడీషియల్ అధికారాలొద్దు

రౌండ్ టేబుల్ సమావేశంలో న్యాయవాదులు, ప్రజా సంఘాలనేతలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 1 : పోలీసులకు జ్యుడీషియల్ అధికారాలతో పౌరహక్కులకు ప్రమాదం ఏర్పడుతుందని సామాన్యులకు న్యాయం అందదని ప్రముఖ న్యాయవాది సీవీ సురేష్ అభిప్రాయ పడ్డారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూతన క్రిమినల్ చట్టాలు, ప్రజా హక్కులకు విఘాతాలు అనే అంశంపై రౌండ్ టేబుల్‌సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యువ న్యాయవాది వడ్ల హరిత అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ బ్రిటీష్ ప్రభుత్వం రూపొందించిన క్రిమినల్ చట్టాలను నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మార్చిందన్నారు. కథారచయిత న్యాయవాది దాదాహయాత్ మాట్లాడుతూ కొత్త చట్టాలలో 85 శాతం పాతవే తిరగరాశారన్నారు. మరో 15 శాతం చట్టాలు వలన పాలకుల కంటే క్రూరంగా మార్చారన్నారు. మరో సీనియర్ న్యాయవాది ముడిమెల కొండారెడ్డి మాట్లాడుతూ కొత్త చట్టాలు ప్రభుత్వాలకు పరపతి గల వారికి అనుకూలంగా వున్నాయన్నారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులే కాకుండా సామాజిక స్పృహ వున్న ప్రతి ఒక్కరూ ఈ చట్టాలను అవగాహన చేసుకుని వ్యతిరేకించాలన్నారు. సమావేశంలో సీపీఎం కార్యదర్శి సత్యం, కాంగ్రెస్ ప్రతినిధి జిలాన్‌బాషా, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య ,రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ మహమూద్ , సీఎంఎస్ పద్మ, మహిళా శక్తి లక్ష్మీదేవి, ఎస్ఎస్ ఖలందర్, రవీంద్ర ,డేవిడ్, ఎస్‌టీయూ రషీద్, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మురళీప్రసాద్,ఐద్వా ముంతాజ్, పల్లపోలు రమణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది సీవీ సురేష్